కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఆగమే



ర్యాలీలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ/మహబూబ్‌నగర్ రూరల్/మహబూబ్‌నగర్ న్యూటౌన్: కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఆగమేనని, రాష్ట్రాన్ని కుక్కలు చించిన విస్తరిలా చేస్తారని మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన హన్వాడ మండల పరిధిలోని కొనగట్టుపల్లి, యారోనిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మాట్లాడారు. 55ఏళ్లుగా పట్టించుకోని కాంగ్రెస్... ఇప్పుడు మరోసారి ప్రజలను మభ్యపెట్టే హామీలతో వస్తోందన్నారు. గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలను అమలు చేసిందని అన్నారు. రుణమాఫీ, ఉచిత కరెంటు, రైతుబంధు, పింఛన్లు, గర్భిణులకు పౌష్టికాహారం, కేసీఆర్ కిట్టు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటివి ఎన్నో అద్భుతంగా అమలు చేసుకుంటున్నామని వివరించారు. మళ్లీ వచ్చే ప్రభుత్వంలో మహిళలకు రూ.3వేలు, రూ.400లకు సిలిండర్ తదితరాలెన్నో అమలు చేస్తామని వివరించారు. మరోమారు ఆశీర్వదించాలని అన్నారు.ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రికి మండలంలో ఘనస్వాగతం లభించింది. కార్యక్రమంలో ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, మాజీ జెడ్పీటీసీ నరేందర్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు రమణారెడ్డి, జంబులయ్య, లక్ష్మయ్య, బాలయ్య, వడ్లశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తరఫున విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోడూర్‌లో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం సాగింది. డీసీసీబీ డైరెక్టర్ నర్సిములు, గ్రామ అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, మన్యంకొండ పాలక మండలి సభ్యుడు చిన్నయ్యగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, మాజీ సర్పంచ్ హన్మానాయక్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓయు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎల్చల దత్తాత్రేయ

- ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎల్చల దత్తాత్రేయ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు తాము ఏకగ్రీవంగా మద్దతును ఇస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి సత్యపాల్, ఏనుగందుల అనిల్ ప్రజాప్రతి, దప్పు కష్ణ, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదీప్ రెడ్డి ఉన్నారు.
- మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ గురువారం స్థానిక అసోసియేషన్‌లో న్యాయవాదులను కలిసి ఓటు వేసి గెలిపించాలని కోరారు. హైదరాబాద్‌లో మహబూబ్‌నగర్‌ను ఒక భాగంగా మారుస్తామని అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారికి బుద్ధి చెప్పాలని కోరారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి రాంనాథ్ గౌడ్, న్యాయవాదులు కే ప్రతాప్ కుమార్, చంద్రమౌళి, హనుమంతు, జాకీర్, టీ వెంకట రామ శర్మ, జగదీశ్వర్ రెడ్డి, స్వదేశ్ తదితరులు పాల్గొన్నారు.
- మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు జిల్లా సామిల్ అసోసియేషన్ ఏకగ్రీవంగా మద్దతునిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నవీన్ పటేల్, కార్యదర్శి ఎండీ సిద్ధికి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శేషు, ముస్తఫా పేర్కొన్నారు. సభ్యులు పలువురు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.



హన్వాడ మండలంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రసంగం వింటున్న ప్రజలు



కారు గుర్తు ఓటేయాలని చూపిస్తున్న సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్

అరాచక పాలనను సాగనంపుదాం



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్ రెడ్డి

హన్వాడ/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నియోజకవర్గంలో అరాచక పాలన కొనసాగుతోందని, అభివృద్ధి మాటున అరాచకాన్ని సృష్టిస్తున్నట్లు బీజేపీ పాలమూరు అభ్యర్థి ఏపీ మిథున్ రెడ్డి ఆరోపించారు. గురువారం మండలకేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మండలకేంద్రంలో ఇంటింటికీ వెళ్తూ ఓటర్లను పలకరిస్తూ తమ ఓటు కమలం పువ్వు గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వృద్ధులను కలుస్తూ ఆప్యాయంగా పలకరించి తమ గుర్తును చూపించి ఓటు వేయాలని సూచించారు. గ్రామంలోని పురవీధుల గుండా వెళ్తూ ప్రజలకు అభివాదం చేశారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వ నిధులే ఉపయోగించారని అన్నారు. తానూ ప్రజాసేవ చేయడం కోసం మాత్రమే రాజకీయాల్లోకి వచ్చానని.. ఒకసారి ఆశీర్వదించి అవకాశం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు లింగం, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వారియర్, హన్వాడ మండలంలోని మునిమోక్షం వాసి రోహిత్‌రెడ్డితో పాటు మహబూబ్ నగర్ రూరల్ మండలంలోని కోటకదిరెకు చెందిన సుమారు 50 మంది యువకులు బీజేపీలో చేరారు. గురువారం జిల్లా కేంద్రంలో వారికి అభ్యర్థి ఏపీ మిథున్ రెడ్డి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, నాయకులు బురుజు రాజేందర్‌రెడ్డి, పడాకుల బాలరాజు, జయశ్రీ, కృష్ణవర్ధన్‌రెడ్డి, ఎ.అంజయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



హన్వాడలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న మిథున్‌రెడ్డి



గుడి మల్కాపూర్‌లో ప్రచారం..

ప్రతి ఎకరాకు సాగునీరు



జడ్చర్ల/నవాబుపేట : ఏమాత్రం అదమరిచి కాంగ్రెస్ పార్టీకి ఓటేసినా మళ్లీ కష్టాల పాలవుతారని... వాళ్లు చెప్పే కల్లబొల్లి మాటలకు మోసపోవద్దని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం బాదేపల్లి పాతబస్టాండ్ ప్రాంతంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల కష్టాలు, ఇబ్బందులను తీర్చే కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేద్దామని పిలుపునిచ్చారు. గత కాంగ్రెస్ పాలనలో తాగు నీరు దొరకక తల్లడిల్లిన రోజులను, కరెంట్ లేక పడిన కష్టాలను ఓ సారి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగ చేశారని, తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తించాలని కోరారు. తమను గెలిపిస్తే ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని అన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఉన్న ఎకరాకు ఎసరు పెడుతారని విమర్శించారు. ప్రతిక్షణం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తనను మరోసారి ఆశీర్వదించి ఉత్సాహాన్ని ఇవ్వాలని, మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

నవాబుపేట మండల పరిధిలోని తీగలపల్లి, నవాబుపేటకు చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, తీగలపల్లి సర్పంచ్ చెన్నప్ప, మాజీ ఎంపీటీసీ నారాయణ, శేఖర్ రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి



నారాయణపేట రూరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతిని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు ఆలయంలో ఓంకారంతో పాటు భక్తిశ్రద్ధలతో సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారి చిత్రపటంతో పట్టణ పురవీధుల గుండా భజనలు చేస్తూ నగర సంకీర్తన నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రశాంతి పతాకావిష్కరణ, సామూహిక సత్యసాయి వ్రతాలు కొనసాగాయి. జిల్లా ఆస్పత్రిలో సాయి పేరుతో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేపట్టి ఆలయ పరిసరాల్లో బీదలకు చీరల పంపిణీ చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అష్టోత్తర శతనామావళి, స్వామివారి డోళారోహణం కనుల పండువగా చేపట్టారు. కార్యక్రమంలో చిట్టెం మాధవరెడ్డి, మల్లికార్జున్, గోపీనాథ్, శివరాజ్, భక్తులు పాల్గొన్నారు.

ఊట్కూర్: మండలంలోని గురువారం శ్రీ సత్యసాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సేవాసమితి సభ్యుడు విశ్వనాథ్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్యారంటీలు తప్పక అమలవుతాయి



నవాబుపేట/జడ్చర్ల: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఏఐసీసీ మైనార్టీ చైర్మన్, ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ గర్హి పిలుపునిచ్చారు. గురువారం జడ్చర్లలో జరిగిన కాంగ్రెస్ మైనార్టీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రాన్ని లూటీ చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉందన్నారు. అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ పథకాలు అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పక అమలు అవుతాయని డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. గురువారం కొండాపూర్, హాజిలాపూర్, రాంసింగ్ తండాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి పదవి లేకున్నా ప్రజాసేవకు అంకితమైన వ్యక్తిగా అందరికి సుపరిచితుడేనని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరిన్ని కార్యక్రమాలు చేస్తాడని.. ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు బంగ్లారవి, నర్సింహచారీ, రాంచంద్రయ్య, వెంకటయ్య, అంతయ్య, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌టీ అవకాశం కల్పించాలి

నారాయణపేట రూరల్: దేశ వ్యాప్తంగా వివిధ హిందీ బోధన సంస్థల ద్వారా విద్వాన్, విశారద కోర్సుల అనంతరం హిందీ పండిత్ ట్రైనింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు టీఆర్‌టీ రాసుకునే అవకాశాన్ని కల్పించాలని ఆ సంఘం నాయకులు నర్సింహ డిమాండ్ చేశారు. 2015లో ఆయా కోర్సులను డిగ్రీతో సమానంగా భావించి పండిత్ ట్రైనింగ్‌కు అర్హత కల్పించారని, 2012లో సైతం హెచ్‌పీటీతో హిందీ టీచర్లుగా నియమితులయ్యారని గుర్తు చేశారు. దాదాపు 25వేల మంది అభ్యర్థుల భవితవ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, వెంటనే సానుకూలంగా నిర్ణయం తెలపాలని కోరారు. సమావేశంలో అరవింద్, వెంకటేష్, బాలకృష్ణ, తులసీదాస్‌మనీల, రాజశ్రీ ఉన్నారు.

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

బాలానగర్: అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక కొందరు నాయకులు తనను హత్య చేయించడానికి ప్రయత్నం చేశారని సేవాలాల్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. గురువారం పెద్దాయపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రోజుల క్రితం తన కారును టిప్పర్‌తో గుద్దించేందుకు యత్నించారని ఆరోపించారు. విషయంపై ఫిర్యాదు చేసినట్లు వివరించారు. హత్య చేయడానికి సుపారీ ఇచ్చిన వారిపై, దాడి చేయడానికి కత్తులతో వెంబడించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఓ పోలీసు అధికారి హస్తం కూడా ఉందని ఆరోపించారు. విషయంపై పోలీసులదే బాధ్యత అని.. మారోమారు ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని వివరించారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం



భూత్పూర్/కొత్తకోట రూరల్/అడ్డాకుల: సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పోతులమడుగు, రావులపల్లి, హస్నాపూర్, శేరపల్లి, ఇప్పలపల్లి గ్రామాల్లో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్నాసాగర్‌లో గురువారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు మందడి సరోజ్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కొత్తకోట ఎంపీపీ గుంత మౌనిక వడ్డెవాట, చర్లపల్లి గ్రామాల్లో ప్రచారం సందర్భంగా ఓటర్లను కోరారు.

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మూసాపేట మండలం పోల్కంపల్లి, నిజాలాపూర్, వేముల గ్రామాల్లో గురువారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ప్రదీప్‌కుమార్‌గౌడ్, జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మినర్సింహ్మ యాదవ్, సర్పంచులు శ్రీకాంత్‌రెడ్డి, సత్యమ్మ, అరుణ, కోఆప్షన్ మదీనా జమీర్, వివిధ గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ప్రచారం

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గంలో గురువారం ప్రచారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో పాల్కొండ, రాజేంద్రనగర్‌తో పాటు హన్వాడ మండలంలో పర్యటించారు. వేపూర్‌ను మండలం చేస్తామన్నారు.

కొత్త పథకాలకు శ్రీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట/మరికల్: దేశంలో ఎక్కడ లేని విధంగా వ్యవసాయరంగానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలిచారని.. మళ్లీ అధికారంలోకి కారు.. సారు.. సర్కారు వస్తేనే కరెంట్ సాధ్యమవుతుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణపేట మండలంలోని కోటకొండ, జాజాపూర్, పేరపళ్ల , కొల్లంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటుచేసిన రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. వ్యవసాయానికి 24గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తుంటే, మూడు గంటల కరెంట్ సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడడం చూస్తే రైతులపై ఎంత చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతుందన్నారు. రైతు సంక్షేమానికి అమలవుతున్న రైతుబంధును యాసంగిలో ఇవ్వకుండా ఆపేయాలని కాంగ్రెస్ నేతలు ఈసీకి ఫిర్యాదు చేయడాన్ని ఒక్కసారి రైతులు ఆలోచించాలన్నారు. సీఎం మరిన్ని కొత్త పథకాలకు శ్రీకారం చుట్టారని వివరించారు. 93 లక్షల మంది నిరుపేద కుటుంబాలకు రైతుబీమా తరహాల్లో ఇంటింటికి బీమా.. కేసీఆర్ ధీమా పథకాన్ని సీఎం ప్రవేశపెట్టనున్నరన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరికీ సన్నబియ్యం, రూ. 400లకే వంట గ్యాస్ సిలిండర్, ఆసరా పింఛన్ తదితర పథకాలను అమలుచేస్తామన్నారు.

కాంగ్రెస్‌వి నీచ రాజకీయాలు

'నేను ఎన్నో రాజకీయాలు చూశాను.. కానీ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఇలాంటి నీచ రాజకీయాలు ఇంత వరకు చూడలేదు' అని సరాఫ్ క్రిష్ణ ముదిరాజ్ అన్నారు. నారాయణపేట మండలంలోని పేరపళ్ల గ్రామంలో ఎమ్మెల్యే చేపట్టిన ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, జాయమ్మ చెరువు నీళ్లు నింపడానికి ఎమ్మెల్యే చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. ఈ నెల 30న మరోమారు ఎస్‌ఆర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీజేపీ, కాంగ్రెస్‌లవి మాయమాటలు

ఎన్నికల వేళ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు చెబుతున్న మాయమాటలను ప్రజలు నమ్మొద్దని నారాయణపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కుమార్తె నందిక రెడ్డి ఓటర్లను కోరారు. జిల్లా కేంద్రంలోని 12,13 వార్డులో ప్రచారాన్ని నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

దామరగిద్ద మండలంలోని చాకలోనిపల్లికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

- బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎస్. రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని గురువారం మరికల్ మండలంలోని ఆయా గ్రామాల్లో నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. తిరిగి మూడోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాజేందర్‌రెడ్డిని గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపతయ్య, రాజేష్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేఖ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగం



మద్దూరు: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోలీంగ్‌స్టేషన్ వరకు రాని వృద్ధులకు, వికలాంగులకు ఇంటినుంచే ఓటుహక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. గురువారం మద్దూరు, కొత్తపల్లి మండలాల్లో ఎన్నికల సిబ్బంది వారి ఇంటి వద్దుకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను పూర్తిచేశారు. మండలంలోని 14మందిని గుర్తించగా వారిలో 12మంది నుంచి పోస్టల్ బ్యాలెట్ వేయించారు. అలాగే కొత్తపల్లి మండలంలో 12మందిని గుర్తించగా అందరిచే పోస్టల్ బ్యాలెట్ వేయించినట్లు రెండు మండలాల తహసీల్దార్లు జయరాం, అనిల్‌కుమార్ తెలిపారు. వీటిని కొడంగల్ ఆర్వో కార్యాలయానికి పంపినట్లు వారు పేర్కొన్నారు.